క్లుప్తంగా

పాలకొల్లు ఒకటో వార్డు ఇన్‌చార్జిగా గేదెల



నరసింహారావుకు నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: పాలకొల్లు పట్టణ వైఎస్సార్ సీపీ ఒకటో వార్డు ఇన్‌చార్జిగా గేదెల నరసింహారావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన నియామకపు ఉత్తర్వులను శుక్రవారం పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) నరసింహారావుకు అందజేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనందరిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు నాయకులు జోగాడ ఉమా మహేశ్వరరావు, శంకరపు శ్రీను, జోగి వెంకటేశ్వరరావు, బండి రమేష్, ఉండ్రాజవరపు రవి, కెల్లా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్ని సచివాలయాల వద్ద యోగా డే

నరసాపురం: పట్టణంలోని అన్ని వార్డు సచివాలయాల వద్ద శనివారం ఉదయం 5.30 గంటలకు ప్రపంచ యోగా డే సందర్భంగా ప్రత్యేక వేడుక కార్యక్రమాలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని స్పష్టం చేశారు.

కరింశెట్టి మృతికి సంతాపం

నరసాపురం: మున్సిపల్ మాజీ కౌన్సిలర్, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ ఉపాధ్యక్షుడు కరింశెట్టి చంద్రశేఖర్ మృతికి నరసాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు సంతాపం తెలిపారు. శుక్రవారం స్థానిక ఛాంబర్ కార్యాలయ భవనంలో సంతాప సభ నిర్వహించారు. కౌన్సిలర్‌గా, చాంబర్స్ ప్రతినిధిగా చంద్రశేఖర్ విశేష కృషి చేశారన్నారు. ఆయన మృతి తీరని లోటని అన్నారు. చంద్రశేఖర్ కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు అధికారి ఏసు, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, గ్రంధి జగపతి, కొండవీటి నాగేశ్వరరావు, కోటిపల్లి దొరయ్య, కోటిపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

యోగాంధ్ర నిర్వహణపై సమీక్ష

పెనుగొండ: అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆచంట ఎంపీడీఓ బి.కృష్ణమోహన్ కోరారు. శుక్రవారం ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో 15 సచివాలయాల పరిధిలో యోగా శిక్షణపై సమీక్ష నిర్వహించారు. యోగాంధ్ర క్యాంపెయిన్‌లో రిజిస్టరైన వారికి యోగాలో ప్రోటోకాల్ ప్రకారం శిక్షణ ఇవ్వాలన్నారు. శనివారం ఉదయం 6 గంటలకు సచివాలయంలో హాజరై యోగా శిక్షణ సక్రమం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం అనంతరం యాప్‌లో డేటా అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పిచ్చయ్య, తహసీల్దారు జి.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



పెనుగొండ లో చానల్ 2 కల్వర్టు వద్ద ఏర్పడిన భారీ గొయ్యి



పెనుగొండలో చానల్ 2 రెండవ వైపు రోడ్డు మార్జిన్‌కు చేర్చి ఉన్న గొయ్యి

- పెనుగొండలో చానల్–2 పంట కాలువ అధ్వానం
- అదుపు తప్పుతున్న వాహనాలు

పెనుగొండ: పెనుగొండలో చానల్–2 పంట కాలువ వద్ద పెనుప్రమాదం పొంచి ఉంది. నరసాపురం ప్రధాన కాలువ నుంచి చానల్ –2 పంట కాలువకు నీరు విడుదల చేసే కల్వర్టు వద్ద ఇరువైపులా భారీ గోతులు పడ్డాయి. దీంతో నిత్యం వాహనాల తప్పించబోయి మోటారు సైక్లిస్టులు, పాదాచారులు గోతుల్లో పడుతున్నారు. కళాశాల, ప్రసిద్ధ దేవాలయం సమీపంలోనే గోతులు ఉన్నాయి. కల్వర్టు వద్ద పూర్తిగా భారీ గోయ్యి ఏర్పడడంతో కల్వర్టు ఎపుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. మరోవైపు చానల్ –2 నే నుంచి రామచంద్రరావు పేట వైపు గతంలో పంట కాలువ ఉండేది. ఇక్కడ ప్రధాన రహదారికి కల్వర్టు గోడ లేకపోవడం, గొయ్యి రోడ్డు మార్జిన్ వరకూ వ్యాపించి ఉండడంతో ఇబ్బంది కరంగా మారింది. దీనికి తోడు గొయ్యిని గుర్తించడానికి వీలులేకుండా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఆదమరిస్తే అంతే

ప్రధాన రహదారైన నరసాపురం– ప్రక్కిలంక రహదారిలోనే పెనుగొండ కూడలి వద్ద కావడంతో నిత్యం వందలాది వాహనాల్లో ప్రయాణాలు చేస్తూ ఉంటారు. తూర్పుగోదావరి, కోనసీమజిల్లాల నుంచి వచ్చే ఇసుక వాహనాలు, ఇతర రవాణా వాహనాలు, ఆర్టీసీ బస్సులు కూడా ఇదే రహదారిలో వెళ్తుంటాయి. దీనికి తోడు కూడలిలో నిత్యం వందలాది మంది కళాశాల విదార్థులు వాహనాల కోసం వేచి ఉంటారు. విద్యార్థులు అధిక సంఖ్యలో రోడ్డుపై ఉండడంతో వారిని తప్పించడానికి వాహనదారులు రోడ్డు మార్జిన్ శివారు వరకూ వస్తుంటారు. ఈ తరుణంలో ఏ మాత్రం ఆదమరిచినా నేరుగా వాహనం గోతులోకి పడిపోయే అవకాశం ఉంది. దీంతో పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉందంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. విద్యుత్ దీపాలు కూడా వెలిగే పరిస్థితి లేకపోవడంతో చీకటిమయంగా ఉంటుంది. దీంతో ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించి, ఇరువైపులా గోతులు పూడ్చి కల్వర్టు గోడలు నిర్మించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు



నరసాపురం బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

నరసాపురం: స్థానిక బస్టాండ్‌లో శుక్రవారం బస్సులు లేక ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొన్నారు. విశాఖపట్టణంలో శనివారం జరగనున్న యోగాడే కార్యక్రమానికి నరసాపురం డిపో నుంచి మొత్తం 41 బస్సులను ప్రభుత్వ ఆదేశాలతో తరలించారు. డిపోలు దూర సర్వీస్‌లు తిరిగే బస్సులు మినహాయిస్తే ఇక కేవలం 10 బస్సులు మాత్రమే మిగిలాయి. నరసాపురం నుంచి ఏలూరు, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం ప్రాంతాలకు ప్రతి 20 నిమిషాలకు ఓ సర్వీస్ నడుస్తుంది. పెద్ద సంఖ్యలో జనం ప్రయాణిస్తుంటారు. అయితే బస్సులు అందుబాటులో ఉండవన్న ముందస్తు సమాచారం ఏపీ ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు ఇవ్వకుండా బస్సులు మొత్తం విశాఖ తరలించారు. దీంతో ప్రయాణికులు బస్టాండ్‌కు చేరుకుని గంటలు తరబడి వేచి చూసి, తీరా విషయం తెలుసుకుని ఇబ్బందులు పడ్డారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి జేబులకు చిల్లులు పెట్టుకున్నారు. కొంతమంది మాత్రం ప్రయాణాలు వాయిదా వేసుకుని తిరిగి ఇంటిబాట పట్టారు.

కొనసాగుతున్న మున్సిపల్ సిబ్బంది ఆందోళన



మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నరసాపురం: ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి పిలుపులో భాగంగా మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. శుక్రవారం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్యకు వినతిపత్రాలు ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి కొద్దిసేపు నినాదాలు చేశారు. పదేళ్ల నుంచి పని చేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, హెచ్‌ఆర్‌సీ పాలసీ అమలు చేయాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు ఈ.మధుబాబు, పిట్టా మహేష్‌బాబు, ఎం.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా రెవెన్యూ శాఖ



యలమంచిలి: రిటైర్డ్ రెవెన్యూ అధికారులను సన్మానిస్తున్న తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్

యలమంచిలి: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేసే ప్రభుత్వ శాఖలన్నింటిలో రెవెన్యూ శాఖ పాత్ర ప్రముఖమైనదని తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్ అన్నారు. రెవిన్యూ డే సందర్భంగా శుక్రవారం స్థానిక కల్యాణ మండపంలో రిటైర్డ్ రెవెన్యూ అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ వడ్డి రవికుమార్, రిటైర్డ్ వీఆర్‌ఓలు రాచర్ల అన్నాజీరావు, అడపా నరసింహారావులను సన్మానించారు. కార్యక్రమంలో మండల నాయకులు బోనం నాని, బొప్పన హరికిషోర్, పెన్మత్స రామభద్రరాజు, ఆర్‌ఐ కవురు యశోద రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లులో..

ప్రజలకు సత్వర సేవలు అందించడంలో రెవెన్యూ ఉద్యోగులది కీలకపాత్రని తహసీల్దార్ వై.దుర్గా కిషోర్ అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా శుక్రవారం పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయంలో రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులను సన్మానించారు. సన్మానం పొందిన వారిలో రిటైర్డ్ తహసీల్దార్ వీర పోతన, రిటైర్డ్ వీఆర్వోలు ఉన్నారు.

పెనుమంట్రలో..



పెనుమంట్ర: రెవెన్యూ డేలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

పెనుమంట్ర: రెవెన్యూ శాఖ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ అన్ని శాఖలకు తల్లి లాంటిదని తహసీల్దార్ వై.రవికుమార్ అన్నారు. శుక్రవారం రెవెన్యూ డే సందర్భంగా సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించి కేక్ కట్ చేశారు. రెవెన్యూ శాఖ అన్ని శాఖలను సమన్వయపరుస్తూ ప్రజావసరం తీర్చడమే కాకుండా ప్రభుత్వా ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖలో పనిచేసే ఇటీవల పదవి విరమణ చేసిన ఇద్దరు ఉద్యోగులను సభలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీటీ ఎలియమ్మ, ఉప సర్పంచ్ భూపతి రాజు శ్రీనివాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో ఆరోగ్యం పదిలం



నరసాపురం రూరల్: వైఎస్ కళాశాలలో యోగా సాధన చేయిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడంవల్ల మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుందని యోగా గురువు రంజిత్ గురూజీ అన్నారు. గత ఆరు రోజులుగా స్థానిక వైఎన్ కళాశాలలో నిర్వహిస్తున్న ధ్యాన యోగా శిక్షణా తరగతుల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ధ్యాన పద్ధతులు, ఆహార నియమాల గురించి వివరించారు. శనివారం యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు గురూజీ పేర్కొన్నారు.

పాలకొల్లులో..



యలమంచిలి: పాలకొల్లు ఏఎస్ఎన్ఎం కళాశాలలో యోగాసనాలు సాధన చేస్తున్న విద్యార్థులు

యలమంచిలి: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ కళాశాలలో తర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం యోగ ఫర్ యూత్ ఎంపవర్మెంట్ అండ్ మెంటల్ హెల్త్ అనే అంశంపై జాతీయ స్థాయి వెబ్‌నార్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజ రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌గా వచ్చిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ ఫ్యాకల్టీ సురేష్ కోర్ యోగా ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆన్‌లైన్‌లో యోగసనాలను నేర్పించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం రామకృష్ణ, సూపరింటిండెంట్ బి.కనకలక్ష్మీ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ బి.రమేష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



నారినమెరకలో విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి

యలమంచిలి: గత 18 సంవత్సరాలుగా నిరాటంకంగా ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా తన స్వస్థలం నారినమెరక పంచాయతీ గమ్మళ్లపెంటలో పదో తరగతి లోపు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులందరికీ విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి సేవ ఆదర్శనీయమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు, ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సీఎస్ విజయ రామరాజు అన్నారు. ఈ విద్యా సంవత్సరంలో గమళ్లపెంటలో ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న 70 మంది విద్యార్థినీ విద్యార్థులకు శుక్రవారం సుమారు రూ.15 వేలు విలువైన విద్యా సామగ్రిని గోపిమూర్తి అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి కూడా ఆయన విద్యా సామగ్రి అందజేశారు., యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతి కుమార్, వలవల విష్ణు బాలాజీ, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామమూర్తి నాయుడు, కోశాధికారి వి.సందీప్ కుమార్ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు పట్టణ పరిధిలోని 28వ వార్డు వీవర్స్ కాలనీలో ఉన్న జీవీఎస్‌వీఆర్‌ఎం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు పాటపళ్ళ నాగ దుర్గ వర ప్రసాద్ శుక్రవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీప్రసాద్ దాతలు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, మధు, లీలా కుమారి, నందిని తదితరులు పాల్గొన్నారు.



చింతలగరువు పాఠశాలలో కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

వద్దిపర్రులో..

యలమంచిలి: ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి చదువులు చదవాలని వద్దిపర్రు సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సరఫరా చేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను వద్దిపర్రు పంచాయతీ చింతలగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు విప్పర్తి శారద, హెచ్‌ఎం కొల్లాబత్తుల సూర్య కుమార్, ఉప సర్పంచ్ కెఎల్ దాసు, మాజీ ఎంపీటీసీ శీలం వాసు పాల్గొన్నారు.

జీవితంలో స్థిరపడేవిధంగా విద్యాబోధన ఉండాలి



ఉదయభాస్కర్

నరసాపురం: విద్యార్థి జీవితంలో స్థిరపడే విధంగా తరగతుల్లో విద్యాబోధన చేసే బాధ్యత అధ్యాపకులపై ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ విభాగం హెడ్ ప్రొఫెసర్ ఎస్.ఉదయభాస్కర్ సూచించారు. వైఎన్ కళాశాలలో ఐదురోజుల నుంచి విద్యావ్యవస్థలో సంస్కరణలు, టీచింగ్ విధానం అంశంపై జరుగుతున్న సదస్సు శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ ఉదయభాస్కర్ మాట్లాడుతూ పుస్తకాల్లోని అంశాలే కేవలం విద్యార్థులకు చెప్పడంలో ఉపయోగం లేదన్నారు. విద్యార్థులతో మమేకమై వారి జీవనవిధానం తెలుసుకుని వారిని విజయ మార్గాలవైపు తీసుకెళ్లే విధంగా విద్యాబోధనలు సాగా లని చెప్పారు. వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అందే రామసతీష్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, పీజీ కోర్సుల డైరెక్టర్ సీహెచ్ చింతారావు, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు పాల్గొన్నారు.

పని గంటల జీఓ వెనక్కి తీసుకోవాలి



పని గంటల జీఓ వెనక్కి తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

యలమంచిలి: పెట్టుబడిదారుల మెప్పుకే రాష్ట్ర ప్రభుత్వం పని గంటల జీఓ ఇచ్చిందని సీఐటీయూ నాయకులు జవ్వాది శ్రీనివాసరావు విమర్శించారు. ఉద్యోగ, కార్మికులు పని గంటలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ నాయకులు పాలకొల్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ చట్టాలు రద్దు చేసి లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. అందులో భాగంగానే పని గంటలు పెంపు, స్త్రీలు రాత్రి డ్యూటీలు వంటి నిర్ణయాలను రాష్ట్ర మంత్రి వర్గంలో తీర్మానం చేసి జీఓ ఇచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారుల మెప్పుకై చట్టాల్లో మార్పులు తెస్తున్నాయని శ్రీనివాసరావు విమర్శించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దేవ సుధాకర్, తాడి వెంకటేష్, పెచ్చెట్టి సత్యనారాయణ, మల్లుల ప్రసాద్, సత్తింశెట్టి పురుషోత్తం, రెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మల్లవరం తాగునీటి చెరువు అధ్వానం



మల్లవరంలో అధ్వానంగా ఉన్న తాగునీటి చెరువు

నరసాపురం రూరల్: మండలంలోని మల్లవరం గ్రామంలోని తాగునీటికి వినియోగించే పంచాయతీ చెరువు నీరు రంగుమారి అధ్వానంగా తయారైంది. కొద్ది రోజులుగా కుళాయి ద్వారా రంగుమారిన, దుర్వాసనతో నీరు సరఫరా అవుతుందని స్థానికులు వాపోతున్నారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందికి విన్నవించామన్నారు. తాజాగా శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామ సభలో తాగు నీటి సరఫరా విషయమై సర్పంచ్, సిబ్బందిని గ్రామస్తులు నిలదీశారు. కాలువలకు నీరు విడుదలైనప్పటికీ ఇంకా చెరువును నింపేందుకు ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడంతో ఆగ్రహం చేశారు. గత కొన్ని రోజులుగా కుళాయిల వెంబడి బోరు నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ఆ నీటిని తాగేందుకు ప్రజలు బయపడుతున్నారు. సుమారు 25 వేల మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో చెరువు నీరు పసర్లెక్కి, అధ్వానంగా తయారైనా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో స్వయం ఉపాధి కోర్సులు



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తున్న దృశ్యం

యలమంచిలి: పాలకొల్లు అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చదువుతోపాటు టైలరింగ్, ఎంబ్రాయిడింగ్, మగ్గం వర్క్ కూడా నేర్చుకునేందు అవకాశం కల్పిస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి చెప్పారు. కళాశాలలో మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో ఇన్స్టిట్యూషనల్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో భాగంగా డబ్ల్యూఎఫ్ఎఫ్ఐ నరసాపురం వారి సహకారంతో గత మూడు నెలలుగా ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు శుక్రవారం ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాజేశ్వరి మాట్లాడుతూ ఉద్యోగం చేయడం ఇష్టం లేని విద్యార్థులు వారి కాళ్లపై వారు నిలబడి ఒక మంచి వ్యవస్థాపకుడిగా ఎదగడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. డబ్ల్యూఎఫ్ఎఫ్ఐ కన్వీనర్ సీహెచ్ జాన్‌బాబు మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన తర్వాత ఉన్నత విద్యను అభ్యసించలేని వారు ఆధునిక టైలరింగ్ శిక్షణ ద్వారా ఉపాధి పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూఎఫ్ఎఫ్ఐ సభ్యులు జాన్ యూస్టేస్, ఐఐసీ కన్వీనర్ డాక్టర్ ఎం.రామకృష్ణ, మహిళా సాధికారిక విభాగ కన్వీనర్ బీకేవీ రామలక్ష్మీ, సభ్యులు వి.శిరీష, బి.ఆశాజ్యోతి పాల్గొన్నారు.